మినీ కథ

# అద్భుతదీపం

సుబ్బారావు, పాపారావు మిత్రులు

పక్కా తాగుబోతులు సుబ్బారావు సీసాలకు సీసాలే పీల్చేస్తే పాపారావు పీపాలకు పీపాలే త్రాగేరకం అసలు వీళ్ళిద్దరూ స్నేహితులయింది ఓ బ్రాందీ షాపులోనే

ఇలా ఉండగా ఓనాడు సుబ్బారావు ఒక కుర్రాడితో పాపారావుకి ఓ చీటీ పంపాడు

పాపారావుకి,

మా ఆవిడ ఊళ్ళో లేదు మీ ఆవిడా ఊరు వెళ్ళిందని తెలిసింది ఇంట్లో బోల్డంత 'మందు' ఉంది ఈ రాత్రి తొమ్మిది గంటలకు నువ్వు మా ఇంటికి వచ్చేస్తే 'పార్టీ' చేసుకుందాం' మిత్రుని ఈ చిన్న కోరిక తీర్చగలవని ఆశిస్తున్నాను నీ కోసం వేయి సీసాలతో ఎదురు చూస్తుంటాను

సుబ్బారావు

పాపారావు ఎగిరి గంతేశాడు

ఆ రాత్రి సుబ్బారా వింటికి బయలు దేరాడు పాపారావు చీకటిరాత్రులవడం వలన తిరిగొచ్చేటప్పటికి 'జాగ్రత్త'కోసం తన వెంట ఓ లాంతరు కూడా తీసుకుని బయలుదేరాడు

మిత్రుణ్ణి ఆనందంగా రిసీవ్ చేసుకున్నాడు సుబ్బారావు అర్ధరాత్రివరకూ మిత్రు లిద్దరూ సురాపానంలో మునిగి తేలారు ఇటువంటి రోజులు— 'రోజుకి రెండు'రావాలని భగవంతుని ప్రార్థించారు

బ్రతికున్నంత కాలం మనం ముగ్గురం (సుబ్బారావు, పాపారావు, 'సీసా'రావు) విడిపోని మిత్రుల్లా కలిసి వుందామని వాగ్దానాలు చేసుకున్నారు

చివరికి మిత్రుడికి 'థాంక్స్' చెప్పి యింటికి బయలుదేరాడు పాపారావు తన లాంతరుతో సహా

బయటంతా కటిక చీకటి లాంతరు సహాయంతో దారి చూసుకుంటూ గోతుల్లో, కాలవల్లో పడకుండా 'తెలివిగా' తప్పించుకుంటూ యిల్లు చేరుకున్నాడు పాపారావు

పక్కమీద పడి గాఢ నిద్రలో మునిగిపోయాడు

మర్నాడు ఉదయం పదిగంటలవేళ ఎవరో తలుపు తడుతుంటే నిద్ర లేచి తలుపు తీశాడు పాపారావు

సుబ్బారావు పంపిన కుర్రాడు పాపారావు చేతికి ఓ చీటీ అందించాడు ఇలా వుంది అందులో —

పాపారావుకి,

నీ లాంతరు యీ కుర్రాడితో పంపుతున్నాను నువ్వు రాత్రి తెచ్చేసిన నా 'చిలక పంజరం' పంపివేయగలవు

సుబ్బారావు

-కోనే నాగవెంకటఆంజనేయులు

